# (సు) రేఖ

హృషీకేశంగారు మహనీయులు. అతనిలా శ్రద్ధాసక్తులతో పనిచేసేవారు మా ఆఫీసులో మరొకరు లేరని చెప్పొచ్చు. ఆఫీసు పనిలో అతనికి తెలియని విషయం లేదు. ఆయన మాకో నిఘంటువు లాంటివారు.

కాని ఏం లాభం. లక్ష్మి కటాక్షం లేదు. సిరి చిరు కన్నేసింది. అయినా తన లేమిని ఏమాత్రం వెల్లడి చెయ్యక చాల గుట్టుగా కాలక్షేపం చేస్తారు.

నాకు బాగా పరిచయమున్నవాళ్ళు, నా శ్రేయస్సు కోరేవాళ్ళల్లో హృషీకేశంగారు ముఖ్యులు. రోజూ ఉదయం ఆఫీసుకు రాగానే హృషీకేశంగార్కి నమస్కరించి ఆయన ఆశీస్సులు పొందడం నాకో అలవాటు.

గత రెండు రోజుల నుంచీ నాకు హృషీకేశంగారి ఆశీస్సులు అందలేదు. ఆయన ఎందుచేతో ఆఫీసుకు రాలేదు. ఒకరిద్దర్నడగ్గా ఆయనకు ఒంట్లో బాగులేదని లీవు లెటరొచ్చిందన్నారు.

సాయంత్రం ఆఫీసు వదలగానే హృషీకేశంగారి కెలా వుందో చూద్దామని బయలుదేరాను. నేనిదివరకెప్పుడూ హృషీకేశంగారింటికి పోలేదు. ఇదే మొదటిమారు.

"హృషీకేశంగారూ!" వీధి గుమ్మంలో నిల్చుని కేకేశాను.

సమాధానంగా వీధి తలుపు తెరిచి ప్రశ్నార్థకంగా నావేపు చూస్తూ నిల్చుందో పద్దెనిమిదేళ్ళ సౌందర్యరాసి.

"హృషీకేశంగారిల్లిదేనా!?" అన్నాను కొంచెం జంకుతూ. యిల్లు పోల్చుకోవడంలో నేనేమైనా పొరపడ్డానేమోనన్న భయంతో.

"ఇదే...."

"ఆయన....?!"

"జ్వరం.... పడుక్కున్నారు, రండి" అంటూ యింట్లోకి దారితీసింది.

నేను మెల్లగా అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళాను.

"నాన్నగారూ!.... నాన్నగారూ! మీ కోసం ఎవరో వచ్చారు" అంటూ ఆయన్ని లేపింది.

"ఎవరూ?" అంటూ భారంగా కళ్ళు తెరిచారు హృషీకేశంగారు.

"నమస్కారం, నేనండీ పురుషోత్తాన్ని" అన్నాను చేతులు జోడించి.

"నువ్వా! రాబాబూ కూర్చో" అంటూ కొంచెం ప్రక్కకు ఒత్తిగిల్లి పడుకున్నారు.

"మీ ఒంట్లో ఎల్లా వుంది?" అంటూ ఆయన శరీరాన్ని తాకి చూసాను.

"అబ్బ! జ్వరం బాగా వుందే?!" అన్నాను.

"అవునండీ, వుదయం నుంచీ మరీ ఎక్కువగా వుంది. డాక్టరుగార్ని పిలుస్తానంటే వద్దంటున్నారు" అందామె.

"అదేంటి! మందు తీసుకోకపోతే జ్వరమెలా తగ్గుతుంది. ఉండండి నేనిప్పుడే డాక్టరుగార్ని తీసుకొస్తా" అంటూ గబగబా డాక్టరుగారి కోసం వెళ్ళాను.

డాక్టరుగారు హృషీకేశంగార్కి ఇంజక్షన్ యిచ్చారు.

"మరేం ఫర్వాలేదు. వుదయానికల్లా జ్వరం తగ్గిపోతుంది. ఈ టేబ్‌లెట్సు కొని గంటల కోటివ్వండి" అంటూ చీటీ వ్రాసిచ్చారు.

నేను దాన్నందుకొని ఆయన చెప్పిన టేబ్‌లెట్సు కొని తెచ్చాను. ఎలా వెయ్యాలో చెప్పి ఆమెకిచ్చాను.

మర్నాడుదయం నేను హృషీకేశంగారింటికెళ్ళేసరికి ఆయన మంచంమీద కూర్చుని వున్నారు.

"మీ జ్వరం తగ్గిందా?" అన్నాను.

"ఆఁ బాగా తగ్గిపోయిందోయ్. కొద్దిగా నీరసం వుందంతే. ఇప్పుడే డాక్టరుగారు వచ్చి చూసి వెళ్ళారు. అయినా సురేఖ వూరికే ఖంగారుపడి పాపం నీకు అనవసరమయిన శ్రమ కల్గించింది"

"శ్రమేం వుందండీ యిందులో" అన్నాను.

"ఆ అభిమానం వుంది కనుకనే ఆదుకున్నావు"

"నాన్నగారూ! కాఫీ...." అంటూ రెండు గ్లాసులతో కాఫీ తెచ్చి ఒకటి ఆయనకిచ్చి రెండవది నాకివ్వబోయింది.

"నేనిప్పుడే తీసుకొని వచ్చానండీ"

"పోనీ మరొక మారు కొంచెమేగా ఫర్వాలేదు తీసుకో" అంటూ బలవంతం చేశారు.

నేను కాదనలేకపోయాను.

"ఆఫీసుకు టైమవుతోంది. వస్తానండీ" అంటూ ఖాళీగ్లాసు మంచం క్రింద వుంచి లేచాను.

రెండు రోజులలో హృషికేశంగారు పూర్తిగా కోలుకుని ఆఫీసుకు వచ్చారు.

నేను రోజూ హృషీకేశంగారింటికి వెళ్తూండేవాడిని.

సురేఖ అందం నన్ను బాగా ఆకర్షించింది. రోజుకు కనీసం ఒక్కసారైనా ఆమెను చూసి ఆమెతో మాట్లాడకపోతే నా మనస్సదోలా వుండేదారోజంతా.

"నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి అర్జంటుగారా" అని నాన్నగారి దగ్గర నుంచి వుత్తరం వచ్చింది.

ఆఫీసుకు రెండు రోజులు శలవు పెట్టి యింటికి బయలుదేరాను.

రాత్రి భోజనాలయిన తరువాత అమ్మతో సురేఖ సంగతి మెల్లగా చెప్పాను.

"సురేఖ వంటి గుణవంతురాలను కోడలుగా తెచ్చుకోవడం అంత అదృష్టం మనకుండొద్దూ? ఒక్క విషయం ఆలోచించు మనకున్నవి కాస్త నీ చదువుకు అయింది. మన అమ్మాయికి పసుపు కుంకం యిచ్చి యించుమించు సంవత్సరం కావస్తోంది. ఇన్నాళ్ళూ ఎందుకు ఆగామో నీక్కూడా తెలుసు. ఈ నెలలో మంచి ముహూర్తాలున్నాయి. పెళ్ళి చెయ్యమని వాళ్ళూరికే తొందర చేస్తున్నారు.

యిప్పుడు నీకిస్తామంటున్న పిల్లేం పరాయిది కాదు. మనక్కావలసినవాళ్లే. మొదటినుంచీ అనుకుంటున్న సంబంధమే నువ్విష్టపడితే యీ రెండు పెళ్ళిళ్ళూ యీ నెలలోనే జరిపించాలని మీ నాన్నగారి వుద్దేశం ఆలోచించుకో" అంది అమ్మ.

"ఇందులో ఆలోచించుకోడానికేం లేదమ్మా. మీ మాటకు నేనెన్నడూ ఎదురు చెప్పను. మీ యిష్టం కానీండి" అంటూ నేను లేచి నా గదిలోకి వెళ్ళాను.

నా రెండురోజుల లీవు రెండు నెలలకు పొడిగించాను.

మావగారి పలుకుబడితో మావూరుకు బదిలీ చేయించుకోగల్గినందుకు నేనెంతో సంతోషించాను.

ఆరు సంవత్సరాలిట్టే అవలీలగా గడిచాయి.

ఒంట్లో బాగులేదని పదిరోజులు సెలవు పెట్టి ఆరోజే డ్యూటీలో జాయిన్ అయ్యాను.

"సంతకం చెయ్యరా బ్రదర్?" అన్నాడు శతకోపం కాగితాన్ని నా ముందుంచి.

"ఏంటది?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం లేదురా! మన ఆఫీసరుకు ట్రాన్సుఫరయింది. ఇవాళ సాయంత్రం ఫోటో, పార్టీకి నీవంతు చందా" అన్నాడు నవ్వుతూ.

"దుర్భిక్షంలో అధిక మాసమా?" అన్నాను సంతకం చేస్తూ.

"తిరిగేసన్నా అర్థం చెడదులే" అన్నాడు శతకోపం బిగ్గరగా నవ్వుతూ.

"మన న్యూ ఆఫీసరు కూడా చాలా మంచివాడ్రా! చాలా హుషారైనవారు. చిన్నతనంలోనే బాగా పైకొచ్చారు. నేనిదివరకాయన వద్ద పనిచేసాను" అంటూ వెళ్ళిపోయాడు శతకోపం.

సాయంత్రం పార్టీకి అన్ని ఏర్పాటులూ చేసి మా న్యూ ఆఫీసరుగారి కోసం ఎదురు చూస్తున్నాము. పార్టీకి ఆయన్ని కూడా రమ్మన్నాము.

సరిగ్గా 5 గంటలకాయన జీపులోంచి దిగారు. "సారీ"! లేటయిందా?" అంటూ గబగబా మావేపు వచ్చారు. వెనుకనే మెల్లగా అడుగులు వేసుకుంటూ వస్తున్న ఆయన శ్రీమతి సురేఖను చూసి క్షణకాలం విస్తుపోయాను.

సురేఖ జీవితరేఖ బాగున్నందుకు నేను చాలా సంతోషించాను.

*'ప్రజామత' వీక్లీ, 3-11-1963*